

సివిల్స్‌లో మెరిసిన కర్నూలు వాసి

- పవన్‌కుమార్ రెడ్డికి 375వ ర్యాంకు
- అమ్మానాన్నలు ఇద్దరూ ఉపాధ్యాయులే
- ఢిల్లీలో ప్రత్యేక శిక్షణ
- రెండో ప్రయత్నంలోనే సివిల్స్‌లో ర్యాంకు



పవన్‌కుమార్‌రెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరానికి చెందిన పవన్‌కుమార్ రెడ్డి మంగళవారం విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 375వ ర్యాంకు సాధించారు. వైద్యవృత్తిలో స్థిరపడాలని భావించి కర్నూలు మెడికల్ కళాశాలలో మెడిసిన్ కూడా పూర్తి చేశారు. దేశానికి, ప్రజలకు సేవలు అందించాలనే తపనతో ఆయన సివిల్స్‌పై దృష్టి పెట్టారు. అమ్మానాన్నల స్ఫూర్తితో 2020-22 సంవత్సరంలో ఢిల్లీలో సివిల్ కోచింగ్ సెంటర్‌లో చేరారు. 2023 సివిల్స్ ఫలితాల్లో తొలి ప్రయత్నంలోనే పవన్‌కుమార్‌రెడ్డి ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. సివిల్స్‌కు ఎంపిక కాలేదని నిరుత్సాహం చెందక రెట్టింపు ఉత్సాహంతో మళ్లీ ఢిల్లీలో కోచింగ్ సెంటరులో సివిల్స్‌లో శిక్షణ తీసుకుంటూ వచ్చారు. 2024 సివిల్స్ ఫలితాల్లో ఆయన 375వ ర్యాంకును సాధించారు. కర్నూలు నగరంలోని సంకల్‌బాగ్‌కు చెందిన ఎం.కృష్ణారెడ్డి, మధుమతి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు పవన్‌కుమార్ రెడ్డి. తండ్రి కర్నూలు మండలం పంచలింగాలలోని ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ హెచ్ఎంగా కృష్ణారెడ్డి పనిచేస్తున్నారు. తల్లి కల్లూరు మండలంలోని ఆర్.కొంతలపాడు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంటుగా మధుమతి పనిచేస్తున్నారు. పవన్‌కుమార్ రెడ్డి ప్రాథమిక విద్య నుంచి హై స్కూల్, మెడిసిన్ స్థాయి వరకు కర్నూలులోనే విద్య కొనసాగింది. 1నుంచి 5వ తరగతి వరకు వెంకటరమణ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాలలోనూ, ఎస్ఆర్‌పేట శ్రీలక్ష్మి పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు, భాస్కర్‌నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో 9, 10 తరగతి వరకు విద్యను అభ్యసించారు. అనంతరం గుంటూరులోని భాష్యం జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో బైపీసీ గ్రూపులో చేరారు. ఇంటర్ పరీక్షలో 975/1000 మార్కులు సాధించారు. 2016లో జరిగిన ఎంసెట్ ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో పవన్ కుమార్ రెడ్డి 6వేల ర్యాంకు సాధించికర్నూలు మెడికల్ కాలేజీలో మెడిసిన్‌లో చేరారు. 2021-22లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు.సివిల్స్‌లో ర్యాంకు రావడంపైతల్లిదండ్రులు కృష్ణారెడ్డి, మధుమతి ఆనందాన్ని వ్యక్తంచేశారు.



పవన్‌కుమార్‌రెడ్డికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

రోజుకు 18 గంటలు కష్టపడ్డా

రెండో ప్రయత్నంలో సివిల్స్‌లో సివిల్స్‌లో 375వ ర్యాంకు సాధించా. మెడికల్ సైన్స్‌ను ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకున్నా. రోజుకు 18 గంటల పాటు కష్టపడ్డా. ర్యాంకు రావడం ఆనందంగా ఉంది.
-పవన్‌కుమార్‌రెడ్డి



బోగస్ పరివేతకు వేళాయె...!

- విద్యాశాఖలో ప్రక్షాళనకు కసరత్తు
- మూడు రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరాలు
- కొందరు ఉపాధ్యాయుల్లో అలజడి
- తేడా వస్తే కఠిన చర్యలు


నంద్యాల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): బదిలీలు, అనుకూలమైన పాఠశాలల్లో స్థానం పొందేందుకు గతంలో కొందరు ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కారు. లేని రోగాలు, వైకల్యం ఉన్నట్లు, పిల్లలకు బాగోలేదని, స్పౌస్ అంటూ తదితర కారణాలను చూపి అక్రమంగా సర్టిఫికెట్లను పొంది 'అనుకూల బదిలీ'లు దక్కించుకున్నారు. అలా అక్రమంగా అంగవైకల్యం పొందినట్లు సర్టిఫికెట్లను పొందిన వారిని గుర్తించేందుకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. లేని రోగాలను సృష్టించుకుని బోగస్ సర్టిఫికెట్లతో బదిలీలు, పదోన్నతులు పొందిన వారిని గుర్తించి ఏరివేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు కూడా జారీ చేసింది. గతంలో కొందరు ఎలాంటి అర్హత లేకపోయినా అక్రమంగా సదరం ద్వారా అంగ వైకల్యం, పిల్లలకు బుద్ధివైకల్యం, తదితర సర్టిఫికెట్లను పొంది వివిధ రూపాల్లో లబ్ధి పొందారు. అంతేకాకుండా గత బదిలీల్లోనూ ప్రత్యేక పాయింట్లు పొంది తమకు కావాల్సిన చోటుకు పోస్టింగ్ పొందారు. ఇప్పుడు త్వరలో ఉపాధ్యాయ బదిలీలు ఉండబోతున్నాయి. రెండు నెలల్లోపు బదిలీల ప్రక్రియ ముగించేందుకు ఉన్నతాధికారులు కూడా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో లాగే మళ్లీ పైరవీలు చేసి అనుకూలమైన చోటుకు బదిలీ పోస్టింగ్ పొందేందుకు కొందరు ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కుతున్నారు. ఈ క్రమంలో ఇలాంటి అక్రమార్కులకు చెక్ పెట్టడంతో పాటు అర్హులకు న్యాయం చేయాలనే సంకల్పంతో.. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ బోగస్ సర్టిఫికెట్ల ఏరివేతకు చర్యలు తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయంతో అక్రమంగా సర్టిఫికెట్లు పొందిన ఉపాధ్యాయులతో పాటు వాటిని మంజూరు చేసిన వైద్యుల్లోనూ అలజడి మొదలైంది. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో వివిధ కేటగిరీల కింద 437 మంది సర్టిఫికెట్లు పొందినట్లు విద్యాశాఖ రికార్డుల్లో నమోదైంది. వీరిలో అక్రమంగా సర్టిఫికెట్లు పొందిన వారిలో భయం పట్టుకుంది.

మూడు రోజుల పాటు వైద్యశిబిరాలు

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖలో పనిచేస్తూ.. వివిధ సర్టిఫికెట్లు పొందిన 437 మందికి ఈ నెల 24, 25, 26వ తేదీల్లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఆశిబిరాలకు హాజరై తమ వైకల్యాన్ని పునఃపరిశీలన చేయించుకోవాలని ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. గతంలో బోగస్ సర్టిఫికెట్లు పొందిన వారిలో ఇప్పుడు గుబులు మొదలైంది. వైకల్యం ఉన్నట్లు ప్రత్యేక వైద్య శిబిరంలో వెల్లడైతే సరే. లేకపోతే వారిపై చర్యలకు సిఫార్సు చేస్తారు. ఈ క్రమంలో కొంతమంది ఉపాధ్యాయులు వైద్య శిబిరాలకు వచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు.

ఆ ఉపాధ్యాయులను గుర్తిస్తారా?

గతం గతః అన్నట్లుగా కాకుండా కూటమి ప్రభుత్వం బోగస్ సర్టిఫికెట్లు పొంది వివిధ రూపాల్లో లబ్ధి పొందిన ఉపాధ్యాయుల ఆటకట్టించడంతో పాటు మరోవైపు అర్హులైన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలనే దిశగా కూటమి ప్రభుత్వం సంకల్పించింది. గతంలో బోగస్ పింఛన్ల ఏరివేత దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో అనేక మంది అక్రమార్కులు పింఛన్ పొందుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో విద్యాశాఖలోనూ ఈ తరహా అక్రమార్కులు ఉన్నారనే అభిప్రాయంతో ప్రభుత్వం సరికొత్తగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొందరు ఉపాధ్యాయులు పైరవీలకు తెరతీసినట్లు సమాచారం. తాజా వైద్యశిబిరాలతో అక్రమార్కులకు పాల్పడిన ఉపాధ్యాయులతో పాటు సర్టిఫికెట్లను మంజూరు చేసిన వైద్యులకూ భయం పట్టుకుంది. తాజా వైద్య శిబిరంలో వైకల్యం లేదని నిరూపణ అయితే ఉపాధ్యాయుడితో పాటు ఆ సర్టిఫికెట్ జారీ చేసిన వైద్యుడిని కూడా బాధ్యుడిని చేస్తారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. దీంతో ఆయా వర్గాల్లో ఆందోళన మొదలైంది.



i. Physically handicapped i.e., from 40% to 55% of Disability to Visually Challenged / Orthopedically Challenged / Hearing impaired employees. (Special Points in transfer).
ii. Physically handicapped i.e., from 56% to 69% Disability to Visually challenged/ Orthopedically Challenged/ Hearing impaired employees. (Special Points in transfers)
iii. Physically handicapped i.e., more than or equal to 80% to Visually Challenged / Orthopedically Challenged employees.
iv. Physically handicapped i.e., more than or equal to 70% to Visually challenged / Orthopedically Challenged / Hearing impaired employees.
v. Medical grounds for the diseases viz Cancer; Open Heart Surgery/Correction of Atrial Septal Defect /Organ Transplantation; Major Neuro Surgery; Bone TB; Kidney Transplantation/Dialysis; and Spinal Surgery
vi. Dependent children and spouse who are mentally challenged and/are undergoing treatment.
vii. Dependent children suffering with Juvenile Diabetes/Thalassemia Disease/Haemophilia Disease/Muscular Dystrophy and are ongoing treatment.
viii. Dependent children who born with congenital heart defect (holes in Heart) and who have undergone surgery shall be considered under preferential category within (3) years from the date of surgery.

కర్నూలు విద్యాశాఖ అధికారులు విడుదల చేసిన ప్రకటన

అలాంటి వారిపై కఠిన చర్యలు



ప్రభుత్వ ఆదేశాలు మేరకు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఈనెల 24, 25, 26వ తేదీల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు (మెడికల్ క్యాంపులు) నిర్వహిస్తున్నాం. ఇందులో వివిధ రూపాల్లో సర్టిఫికెట్లు పొందిన ఉపాధ్యాయులు హాజరవుతారు. ఎవరైనా అక్రమంగా సర్టిఫికెట్లు పొందినట్లు రుజువైతే వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయి. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో అర్హులకు న్యాయం జరుగుతుంది.

- జనార్దన్ రెడ్డి, డీఈవో, నంద్యాల

హెచ్‌టీ బీటీ విత్తనాలపై అప్రమత్తం

- ఈ రకం విత్తనాలతో పర్యావరణానికి ప్రమాదం
- రైతులకు అందకుండా ముమ్మర తనిఖీలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2.60 లక్షల హెక్టార్లలో సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతలు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అత్యధికంగా పత్తి ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగవుతోంది. వచ్చే ఖరీఫ్‌లో రైతులు భారీగా పత్తి సాగుకు సిద్ధమవుతున్నట్లు వ్యవసాయ శాఖ యంత్రాంగం అంచనా. ఇందులో భాగంగా రైతులు పర్యావరణానికి పెనుముప్పు కలిగించనున్న హెచ్‌టీ కలిగిన బీటీ పత్తి విత్తనాలు వినియోగించకుండా చర్యలు తీసుకునేందుకు ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ యంత్రాంగం వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో అప్రమత్తమయింది. హెచ్‌టీ పత్తి విత్తనాల ఉత్పత్తి, సాగు, అమ్మకాలను కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల కిందటే నిషేధించింది. వీటి సాగు వల్ల పర్యావరణానికి హానీ కలుగుతుందని, నేల విషతుల్యమైపోతుందని గుర్తించి ఈ విత్తనాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఈ విత్తనాల తయారీ సమయంలోనే అడ్డుకట్ట వేస్తే రైతులకు సరఫరా కాకుండా నియంత్రించవచ్చనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ ప్రత్యేక బృందాలను నియమించి తనిఖీలకు సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా వ్యవసాయ కమిషనర్ కార్యాలయం నుంచి కర్నూలు, నంద్యాల జిల్లాలకు ఏడీఏ ఏవో స్థాయి అధికారులు వచ్చారు. ప్రస్తుతం వీరు కర్నూలు జిల్లాలో పత్తి విత్తనాల నమూనాలు సేకరిస్తున్నారు. వీరికి ఆయా మండలాల్లో ఉన్న మండల వ్యవసాయాధికారులు సహకారాలు అందిస్తున్నారు. వీరంతా బృందాలుగా ఏర్పడి కర్నూలు, నంద్యాల, ఆదోని ఎమ్మిగనూరు, కోడుమూరు, తదితర ప్రాంతాల్లో ఉన్న పత్తి విత్తనాల జిన్నింగ్ ఫ్యాక్టరీలు విత్తనాలు పంపిణీ చేసే కంపెనీల గోదాములు, హోల్‌సేల్, రీటైల్ డీలర్ల షాపులు, అదే విధంగా పార్సిల్, రవాణా కార్యాలయాల్లో ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. అక్కడికక్కడ నమూనాలు సేకరించి హెర్బిసైడ్ ట్రైట్ జెన్యూ పరీక్షలు చేసి ఆ పత్తి విత్తనాల్లో హెట్ జెన్యూ ఉందా లేదా అని నిర్ధారిస్తున్నారు. ఇప్పటి దాకా పరీక్షించిన విత్తనాల్లో హెచ్‌టీ పత్తి విత్తనాలు ఉన్నట్లు నిర్ధారణ కాలేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి.



హెట్ టీ పత్తి విత్తనాలు ఇవే

కలుపు నివారణ ఖర్చులు తగ్గుతాయని..

నేలలో, పరిసరాల్లో తీవ్ర దుష్ఫలితాలు కలిగించే హెచ్‌టీ కలిగిన బీటీ పత్తి విత్తనాలను 2019లో ఉమ్మడి జిల్లాలో రైతులు వినియోగించారు. ఈ హెచ్‌టీ పత్తి విత్తనాలను సాగు చేస్తే పొలంలో కలుపు నివారణ మందులు చల్లాల్సిన అవసరం ఉండదని, దీని వల్ల కూలీల ఖర్చు తగ్గిపోతుందని రైతులు అనుకున్నారు. ఈ రకమై ప్రచారం జరగడంతో రైతులు నిజమే అని నమ్మారు. అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ హెచ్‌టీ పత్తి విత్తనాల సాగు వల్ల పర్యావరణ పరంగా అనేక సమస్యలు వస్తున్నట్లు గుర్తించి హెచ్‌టీ పత్తి విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులను సాగు చేపట్టకుండా ఈ విత్తనాలపై నిషేధం విధించింది. అయితే కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇప్పటికీ కలుపు సమస్య తగ్గుతుందనే ఆలోచనతో హెచ్‌టీ పత్తి విత్తనాలను సాగుకు ఉపయోగిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ఖరీఫ్ సీజన్ మే నెలాఖరులో ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తుండటంతో హెచ్‌టీ పత్తి విత్తనాలను సాధ్యమైనంత తొందరగా స్వాధీనం చేసుకుని రైతులకు అందకుండా చేసేందు కట్టు దిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు.

నందివర్గం సొసైటీలో అవినీతిపై విచారిస్తాం: మంత్రి బీసీ



చేనేతలకు మగ్గాలు, పరికరాలు పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నందివర్గం సొసైటీలో గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు లక్షల రూపాయలు దుర్వినియోగం చేశాడనే ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సొసైటీలో అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.నంద్యాల జిల్లాలోని బనగానపల్లెమండలం నందివర్గం గ్రామంలో 75 మంది చేనేత లబ్దిదారులకు రూ.28లక్షల విలువ చేసే చేనేత మగ్గాలు,పరికరాలను సబ్సిడీపై పంపిణీ చేశారు.గతంలో ఎన్నడూ లేని విధంగా చేనేత కుటుంబాలకు రూ.200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. పవర్‌లూమ్ యంత్రాలు ఉపయోగించే చేనేత కుటుంబాలకు 500 యూనిట్ల వరకు ఉచితంగా ఇవ్వడం సీఎం చంద్రబాబునాయడుకే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత పరిశ్రమల శాఖఏడీ జి. నాగరాజారావు ఏడీవో ఈశ్వరయ్య,మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, ఉమామహేశ్వరరావు, లాయర్ సుబ్రమణ్యం, బండా సుబ్బారావు, సీతారామయ్య, రాముడుపాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి సెలవులు



నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు గురువారం నుంచి వేసవి సెలవులు ప్రకటిస్తున్నట్లు ప్రభుత్వ విద్యాశాఖ డైరక్టర్ విజయ్‌రామరాజు ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 24వ తేదీ జూన్ 11వ తేదీ వరకు సెలవులుంటాయని తెలిపారు.12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని ఉత్తర్వుల్లో వెల్లడించారు.



భానుడి భగభగలు

- రోజుకు రోజుకూ పెరుగుతున్న ఎండలు
- ఉమ్మడి జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు
- ఆళ్లగడ్డలో 43.76, కోసిగి మండలంలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాల, కర్నూలు జిల్లాల్లో మంగళవారం 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. ఆళ్లగడ్డలో 43.76 డిగ్రీల ఉష్ణోగ్రత, కోసిగి మండలం సాతనూరులో 43.5, పాణ్యం మండలం గోనవరంలో 43.34, మంత్రాలయం మండలం వగరూరులో 43.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కల్లూరు మండలం ఉలిందకొండలో 42.93, గోస్పాడులో 42.83, పాములపాడులో 42.75, బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురంలో 42.7, కర్నూలు నగరంలో 42.7, కోడుమూరు మండలం లద్దగిరిలో 42.59 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది. సంజామల మండలం పేరుసోములలో 42.56, శిరివెళ్లలో 42.44, బనగానపల్లె మండలం యాగంటిలో 42.4, దొర్నిపాడులో 42.4, బనగానపల్లె మండలం పాతపాడులో 42.37, పసుపులలో 42.3, కోవెలకుంట్ల మండలం గుళ్లదుర్తిలో 42.26, గడివేములలో 42.09, బనగానపల్లెలో 42.04 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే డోన్‌లో 42.03, జూపాడు బంగ్లాలో 42.01, నంద్యాల పట్టంలో 42.0, చాగలమర్రి మండలం ముత్యాలపాడులో 41.97, ఓర్వకల్లులో 41.20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది.

పసుపు డీలా..!


రుద్రవరంలో పసుపు కొమ్ములను నెరుపుతున్న కూలీలు

- తగ్గిన పసుపు ధర
- క్వింటంపై రూ.5వేలు పతనం
- జిల్లాలో 1500 ఎకరాల్లో సాగు

రుద్రవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పుడమి తల్లిని నమ్ముకొని మట్టి మనిషి పసుపు సాగుచేశారు. ఏడాదిపాటు కంటికి రెప్పలా కాపాడుకున్నారు. పసుపు చేతికి వచ్చేసరికి దిగుబడి తగ్గింది. మార్కెట్లో రేటూ తగ్గింది. ఒక్కో ఎకరాకు రూ.2లక్షల మేర పెట్టుబడి పెట్టిన రైతులు ధర తగ్గుముఖం పట్టడంతో ఆందోళన చెందుతున్నారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 1500ఎకరాల్లో పసుపు విస్తారంగా సాగు అవుతోంది. రుద్రవరం మండలం ఆలమూరు, చిత్తరేణిపల్లె, రుద్రవరం, నాగులవరం, రెడ్డిపల్లె తదితర గ్రామాల్లో రైతులు పసుపు పంటపైనే ఆధారపడి జీవిస్తున్నారు. గత ఏడాది 2024 జూన్ మాసంలో పసుపు సాగుచేశారు. పసుపు పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ఎకరాకు వెయ్యి కేజీల విత్తనం వినియోగించినట్లు రైతులు తెలిపారు. సుమారు పసుపు దిగుబడి 60 నుంచి 70 పుట్లు దాకా సగటున దిగుబడి వచ్చిందని రైతులు తెలిపారు. మైదుకూరు పసుపు రకం ఒకటి, మరో రకం సాగు చేశారు. గత ఏడాది మార్కెట్లో పసుపు కొమ్ముల క్వింటం రూ.16వేలు రేటు పలికింది. పసుపు దుంపలు పుట్టి (250 కేజీలు) రూ.8,500 రేటు పలికింది. 2024లో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. మంచి లాభాలు, మంచి దిగుబడి వచ్చిందని అన్నారు. కానీ ప్రస్తుతం మార్కె ట్‌లో ధర అమాంతంగా పడిపోయింది. మార్కెట్‌లో పసుపు కొమ్ములు క్వింటం రూ.10వేలు నుంచి రూ.11 వేలు రేటు పలుకుతోంది. పసుపు దుంపలు పుట్టి (250 కేజీలు) రూ.3500 రేటు పలుకుతోంది. పసుపు కొమ్ములపై క్వింటా రూ.5వేలు, పసుపు దుంపలు పుట్టిపై రూ.5వేలు రేటు తగ్గిందని రైతులు ఆందోళన పడుతున్నారు. ఎంతో ఆశతో సాగు చేస్తే పసుపు పంట నిరాశ మిగిల్చిందని వాపోయారు.


పసుపు కుప్పలు



పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు



పసుపు సాగులో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎకరాకు రూ.2లక్షలు పెట్టుబడి పెట్టాం. దిగుబడి కూడా తగ్గింది. మార్కెట్లో ధర తగ్గింది. ధర కోసం ఎదురు చూస్తున్నాం. ఆరు ఎకరాల్లోసాగు చేసి రూ.12 లక్షలు పెట్టుబడి పెట్టా.

\- సుబ్బరాయుడు, రైతు, రుద్రవరం

ధర తగ్గింది



పసుపు దిగుబడికి మార్కెట్లో ధర తగ్గింది. గత ఏడాది ఒట్టి పసుపు క్వింటా రూ.16వేలు రేటు పలికింది. ప్రస్తుతం క్వింటా ఒట్టి పసుపు రూ.10 నుంచి రూ.11 వేలు రేటు పలుకుతోంది. పచ్చి పసుపు పుట్టి (250కేజీలు) గత ఏడాది రూ.8,500 రేటు పలికింది. ప్రస్తుతం పుట్టి పచ్చి పసుపు రూ.3,500 రేటు పలుకుతోంది.

-శ్రీనివాసులు, రైతు, రుద్రవరం


పసుపు కొనుగోలుపై ఆదేశాలు లేవు



మార్కెటింగ్ శాఖకు పసుపు కొనుగోలు చేయడానికి ఆదేశాలు ఇంకా ఇవ్వలేదు. ప్రభుత్వం ఆదేశిస్తే మార్కెటింగ్ శాఖ పసుపు కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటుంది. పసుపు రకాల సాగు మార్చాలని రైతులకు సూచించేందుకు సభలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సభలు ఏర్పాటు చేస్తాం.

\- నాగరాజు, జిల్లా ఉద్యాన అధికారి, నంద్యాల

పసుపును ఉడకబెడుతున్న దృశ్యం



ప్రిన్సిపాల్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు


ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌ను సన్మానిస్తున్న రాయపాటి శ్రీనివాసులు, మహబూబ్ బాషా

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.నాగస్వామి నాయక్‌కు సేవారంగంలో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపునకు గానూ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు. మంగళవారం నేషనల్ ఉమెన్స్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఏపీ క్యాంపులోని సీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో లైఫ్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంటు రాయపాటి శ్రీనివాసులు, డీఎస్పీ మహబూబ్‌బాషా, పాఠశాల హెచ్ఎం వెంకటరెడ్డి కలిసి నాగస్వామి నాయక్‌కు అవార్డు అందజేశారు. ఈసందర్భంగా ఆయనను శాలువా కప్పి జ్ఞాపిక, సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. కళాశాల అధ్యాపకుల, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ల (మేల్)కు పని సర్దుబాటు

45 మందితో సీనియారిటీ జాబితాను విడుదల చేసిన డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో విధులు నిర్వహిస్తున్న హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్‌ఏ-మేల్) ఉద్యోగుల సేవలను మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో వినియోగించుకునేలా వారిని సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియలో భాగంగా మంగళవారం డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న ఎంపీహెచ్‌ఏ (మేల్) ఉద్యోగులు సీనియార్టీ జాబితాను 46 మందితో విడుదల చేశారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే రెండు రోజుల్లో జిల్లా మలేరియా కార్యాలయంలో తెలియజేయాలని డీఎంహెచ్‌వో ఆదేశాలు జారీ చేశారు. అభ్యంతరాల తర్వాత కౌన్సిలింగ్ తేదీని ప్రకటించి ఉద్యోగులను సర్దుబాటు చేయనున్నారు. ఇక నంద్యాల జిల్లాలో హెల్త్ అసిస్టెంట్లు (మేల్) ఉద్యోగుల సర్దుబాటు కౌన్సిలింగ్ బుధవారం నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరగనుంది.

టీటీడీ నిధులతో కల్యాణ మండపాలు

- ఏఈఈఈ లక్ష్మీపతి

మహానంది, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):, నంద్యాల జిల్లాలో రూ.12.60 కోట్లతో కల్యాణ మండపాల నిర్మాణాలు జరుగుతున్నట్లు టీడీడీ ఏఈఈ ఎం.లక్ష్మీపతి తెలిపారు. మంగళవారం సాయంత్రం మహానంది క్షేత్ర పరిసరాల్లో నిర్మాణం పూర్తయిన డార్మెటరీని ఏఈఈ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహానందిలో రూ.1.60 కోట్ల టీటీడీ నిధులతో డార్మెంటరీ నిర్మాణం పూర్తి దశకు వచ్చిందన్నారు. టీటీడీ నిధులతో నంద్యాల పట్టణంలో అత్యాధునికంగా నిర్మిస్తున్నకల్యాణ మంటపం కూడ పూర్తి దశకు వచ్చిందని చెప్పారు.

జూనియర్ సివిల్ న్యాయాధికారుల బదిలీ

కర్నూలు లీగల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు జూనియర్ సివిల్ న్యాయాధికారులు బదిలీ అయ్యారు. కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి టి.జ్యోత్స్నదేవి ఖాళీగా ఉన్న పత్తికొండకు బదిలీ అయ్యారు. కర్నూలు రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి జి.వందన కృష్ణా జిల్లా నందిగామ అదనపు జూనియర్ న్యాయాధికారిగా, ఖాళీగా ఉన్న బనగానపల్లె జూనియర్ సివిల్ న్యాయా. ధికారిగా అనంతపురం జిల్లా కదిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న ఎస్. ప్రతిమ బదిలీ అయ్యారు. కర్నూలు మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ ఎం.కళ్యాణి బాపట్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ కాగా ఆ స్థానంలో నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట మేజిస్ట్రేట్ ఎస్.అనూష వచ్చారు. కర్నూలు ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎం. సరోజనమ్మ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా ఆమె స్థానంలో సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా పనిచేస్తున్న ఎస్. అనిల్‌కుమార్ బదిలీ అయ్యారు. కోవెలకుంట్ల జూనియర్ సివిల్ న్యాయాధికారిగా పనిచేస్తున్న అబ్దుల్ రెహిమాన్ షేక్ నెల్లూరు మూడో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ అయ్యారు. ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా నెల్లూరులో నాల్గవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా పనిచేస్తున్న టి. భాస్కర్ బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న ఎంఈ వెంకట ప్రసాద్ కడప రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ అయ్యారు. డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా పి.రాహుల్ అంబేడ్కర్ ఆత్మకూరు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ అయ్యారు.

తెలుగు నాటక రంగానికి జీవం పోస్తాం

ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ


ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు నాటకరంగానికి జీవం పోస్తామని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 75వ వజ్రోత్సవ జన్మదిన సాంస్కృతిక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదట సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తర్వాత గుమ్మడి గోపాలకృష్ణ చంద్రబాబు నాయుడుపై రాసిన 'పుడతారు ఎందరో మహానుభావులు..' అనే పాటతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 100 రోజుల సాంస్కృతిక ప్రదర్శనలకు శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ గుమ్మడి గోపాలకృష్ణ అంతర్జాతీయ నటుడిగా నాటకరంగ పురోభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ కమలపాలికలో నటించిన కళాకారులు కే బాలవెంకటేశ్వర్లు, జీవీ శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, పి. రాజారత్నం, చిదంబరరెడ్డి, సురభి ప్రభావతి, ఇటీవల కందుకూరి పురస్కారాలు అందుకున్న ఎమ్ఆర్ రాధిక, మంజులను ఆయన సత్కరించారు. అనంతరం ప్రదర్శించిన 'శ్రీకృష్ణ కమలపాలిక' పౌరాణిక పద్య నాటకం ప్రేక్షకులను అసాంతం ఆకట్టుకుంది.

నేడు 'తరమెల్లిపోతున్నదో' సాంఘిక నాటకం

టీజీవీ కళాక్షేత్రంలో బుధవారం నాలుగో రోజు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా గుంటూరుకు చెందిన కరణం సురేష్ మెమోరియల్ ఆర్ట్స్ సంస్థ వారు 'తరమెల్లిపోతున్నదో' సాంఘిక నాటకం ప్రదర్శిస్తారని తెలిపారు.

గుమ్మడి గోపాలకృష్ణకు సత్కారాలు ..

ఏపీ నాటక అకాడమీకి రెండోసారి చైర్మన్‌గా నియమితుడైన గోపాలకృష్ణను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ తన కార్యాలయంలో సత్కరించారు. మాజీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, చిత్ర నిర్మాత బీవీ రెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, వ్యాపారవేత్త ఇల్లూరి లక్ష్మయ్య హోటల్ త్రిగుణక్లార్క్‌లో సన్మానించారు.


గుమ్మడి గోపాలకృష్ణను సత్కరిస్తున్న పత్తి ఓబులయ్య, రంగస్థల కళాకారులు.,

అంతటా ఆహార కల్తీ



జిల్లాలో ఆహార కల్తీ ప్రజారోగ్యానికి పెను సవాల్‌గా మారింది. నగరంలో ఈ సమస్య మరింత పెచ్చుమీరుతోంది. చట్టాల అమలులో ఉదాసీనత, అధికార యంత్రాంగం అలసత్వం, సిబ్బంది కొరత మొదలైనవి కల్తీరాయుళ్లకు బాగా కలిసి వచ్చింది. ఫలితంగా ప్రతి ఏటా కల్తీ ఆహార బాధితుల సంఖ్య వేలల్లో పెరిగిపోతోంది. ఆధునిక వసతులు, ప్రమాణాలతో కూడిన పరీక్ష కేంద్రాలు స్థానికంగా అందుబాటులో లేకపోవటం కూడా ఆహార కల్తీ సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు.

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిత్యం ఏదో ఒక మూలాన ఆహార కల్తీ కేసులు వెలుగు చూస్తునే ఉన్నాయి. నిత్యావసరాల మొదలు తినుబండారాల వరకు విడి పదార్థాలు నుంచి ప్యాకేజ్డ్ వస్తువుల వరకు అన్నీ కల్తీమయంగా మారాయి. వ్యాపారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కారంలో రంపపు పొట్టు, పిండిలో నాణ్యత లేని పదార్థాలు, నిషేధిత రసాయనాలను వాడి పండ్లను మాగపెట్టడం, కృత్రిమ రంగులతో ఆహార పదార్థాలను ఆకర్షణీయంగా తయారు చేయటం, వంట నూనెల్లో నిషేధిత జంతు కొవ్వులు వినియోగించటం, ఫ్రిజ్‌లో దీర్ఘకాలం నిల్వ ఉంచిన పదార్థాలను వాడటం మొదలైనవి ప్రజారోగ్యానికి శాపంగా మారాయి. ఇటీవలి కాలంలో ఆహార కల్తీ నియంత్రణ అధికారుల తనిఖీల్లో విస్తుగొలిపే అంశాలు వెలుగు చూశాయి. హాలహర్విలో నెయ్యిని కల్తీ చేస్తూ ఓవ్యక్తి పట్టుబడ్డాడు. గూడూరులో నాణ్యతలేని బెల్లం విక్రయిస్తూ మరో వ్యాపారి అధికారులకు చిక్కాడు. నగరంలోని ఒక హోటళ్లలో తినడానికి యోగ్యత లేని చికెన్ ధమ్ బిర్యానీ, నాణ్యత లేని పెరుగు అమ్ముతూ నిర్వాహకులు దొరికిపోయి జరిమానా చెల్లించారు.



అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయం

ఆహార కల్తీ నియంత్రణ అధికారులు సాధారణ తనిఖీలతో సరిపుచ్చుతున్నారే తప్ప, భారీ జరిమానాలు, కఠిన శిక్షలు విధించకపోవటంతో కల్తీరాయుళ్లలో భయం, బాధ్యత లేకుండా పోయింది. తరచూ తనిఖీలతో పాటు ఆకస్మిక దాడులు నిర్వహించాల్సిన సిబ్బంది తమ లక్ష్యానికి అనుగుణంగా నామమాత్రంగా చర్యలు చేపట్టి మమ అనిపిస్తున్నారనే అపవాదు మూట కట్టుకున్నారు. ఏడాది కాలంలో యంత్రాంగం 570 నమూనాలను సేకరించగా అందులో కేవలం 242 మందిపైనే కేసులు నమోదు చేశారు. ఇందులో 21 హానికరమైనవిగా, మరో 23 నాణ్యత లేని ఆహారంగా గుర్తించటం గమనార్హం. వీరి నుంచి రూ.2.20 లక్షల జరిమానా వసూలు చేసి చేతులు దులుపుకున్నారు. వాస్తవానికి ఆహార కల్తీకి పాల్పడితే 6 నెలల నుంచి 3 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చని చట్టం చెబుతోంది. కానీ ఇవి ఏవీ అమలుకు నోచుకోవటం లేదు. కల్తీకి పాల్పడుతూ ఎవరైనా దొరికితే సాదాసీదా జరిమానాలతో సరిపుచ్చటం తప్ప జైలు శిక్ష వంటి కఠిన శిక్షల అమలుకు నోచుకోవటం లేదు. ఇప్పటి వరకు వ్యాపారికి జైలు శిక్ష పడిన సందర్భాలు అధికార వర్గాలకే గుర్తు లేదంటే అతిశయోక్తి కాదు. చాలా వరకు కేసులు ఎటూ తేలకుండా కోర్టుల్లో ఉండటం, వాటికి దీర్ఘకాలం సమయం వెచ్చించాల్సి రావటం కూడా కల్తీరాయుళ్లకు కలిసి వస్తోంది.

సిబ్బంది కొరత: ఆహార కల్తీ నిరోధానికి ప్రధానంగా శాఖాపరంగా సిబ్బంది కొరత ఒక సమస్యే అని చెప్పాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నలుగురు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉండాలి. కానీ ఇద్దరు సహాయ కంట్రోలర్లు అవసరం కాగా ఒకరే విధులు నిర్వర్తిస్తున్నారు. క్షేత్రస్థాయిలో నమూనాల సేకరణకు కీలకమైన సహాయక సిబ్బంది నలుగురు కావాల్సి ఉండగా, ఒక్కరు కూడా లేరు. దీని వల్ల నమూనాల సేకరణ, వాటిని పరీక్ష కేంద్రాలకు పంపి, ఫలితాలు రాబట్టడంలో అలస్యం జరుగుతోంది. దీనికి తోడు నమూనాల పరీక్ష కేంద్రం ఏపీలో లేదు. తెలంగాణలోని నాచారంలో ఉంది. ఇది కూడా అధికార యంత్రాంగానికి ప్రతికూలాంశంగా మారింది. వీటితో పాటు క్షేత్రస్థాయి తనిఖీలకు అవసరమైన వాహనాల కొరత కూడా వేధిస్తోంది. సొంత వాహనం ఒకటీ లేకపోవడంతో అత్యవసర సమయాల్లో అద్దె వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. అసలే అరకొర సిబ్బంది, వాహనాలలేమితో అవస్థలు పడుతున్న సంబంధిత యంత్రాంగానికి ప్రముఖుల పర్యటనలు మరింత పనిభారమనే చెప్పాలి. వీఐపీ ప్రొటోకాల్ దృష్ట్యా సమయం మొత్తం అక్కడే గడపాల్సి రావటం కూడా సిబ్బంది రోజువారీ తనిఖీలకు విఘాతం కల్గిస్తోంది.

- తూతూ మంత్రంగా తనిఖీలు
- నామమాత్రపు జరిమానాలు, శిక్షలు
- వేధిస్తోన్న సిబ్బంది కొరత
- బాధ్యత, భయం లేని వ్యాపారులు

నిరంతరం తనిఖీ చేస్తున్నాం



లక్ష్యానికి అనుగుణంగా నిరంతరం తనిఖీ చేస్తున్నాం. ఫిర్యాదులు అందితే మరింత తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఇప్పటికే తనిఖీల ద్వారా జరిమానాలు వసూలు చేశాం. అదనపు సిబ్బంది అవసరం ఉంది. త్వరలోనే విశాఖపట్నంలో నూతనంగా పరీక్ష కేంద్రం పూర్తి కానుంది. దీని వల్ల నమూనాల సేకరణ, ఫలితాలు రాబట్టం మరింత వేగమవుతుంది. వ్యాపారులు కల్తీకి పాల్పడితే వారి లైసెన్స్ రద్దు చేస్తాం.

\- కూర్మ నాయకులు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తాం

- రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం స్థానిక రామకృష్ణ పీజీ కళాశాలలో ఏపీయూడబ్ల్యూజే సమావేశం జరిగింది. ఈకార్యక్రమానికి ఆయనతో పాటు రాష్ట్ర ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐవీ సుబ్బరావు పాల్గొన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు ఇవ్వడానికి తనవంతు కృషి చేస్తామన్నారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రమాదబీమా, హెల్త్‌కార్డులు ఇవ్వాలని ఐవీ సుబ్బరావు కోరారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ నియామకం

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీని నియమిస్తూ కలెక్టర్ రంజిత్ బాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు కర్నూలు, సెక్రటరీగా కర్నూలు డిస్ట్రిక్ట్ ఎస్సీ వెల్ఫేర్ అండ్ ఎండోమెంటు గ్రూప్-1 ఆఫీసర్స్ (ఎస్సీ-మాల), కర్నూలు డీఎం సివిల్ సప్లయ్ ఆఫీసర్ నాగసుధ, కర్నూలు ఆర్డీవో ఎస్టీ కిడారి సందీప్‌కుమార్, నాన్ ఆఫీషల్స్ మెంబర్స్ మాలతి, సురేంద్ర, మాదిగ మద్దిలేటి, రవికుమార్, కే.మధు నాయక్, నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్స్ అసోసియేషన్ నుంచి వెంకట నాగరాజు, ఈడిగ సురేష్ కుమార్, కురువ మద్దిలేటిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

పెట్టుబడిదారులకు ఆహ్వానం : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టూరిజం ప్రాంతాలను పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ విధానంలో అభివృద్ధి చేసేందుకు పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆదోని రామజులచెరువు, గాజులదిన్నె దామోదరం సంజీవయ్యసాగర్ ప్రాజెక్టు, తుగ్గలి మండలం ఎర్రగుడి గ్రామం వద్ద అశోకుని శిలాశాసనాలు, ఆదోని మండలం బనవాసి గ్రామం, పెద్దతుంబళం జైన్ ఆలయం, కల్లూరు మండలం లక్ష్మీపురం వద్ద ఉన్న శ్రీలక్ష్మి జగన్నాథగట్టు, ఓర్వకల్లు రాక్‌గార్డెన్, గార్గేయపురం చెరువు ప్రాంతాలను పర్యాటకపరంగా రెస్టారెంట్లు, రిసార్ట్స్, పార్కులు అభివృద్ధి చేసే వీలుందని వివరించారు. ఆసక్తి ఉన్న పెట్టుబడిదారులు ముందుకు రావాలని పేర్కొన్నారు. వివరాలకు 6309942034 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

మహిళా హెల్త్ సూపర్‌వైజర్లకు పదోన్నతి

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 పరిధిలో పని చేస్తున్న 22 మంది హెల్త్ సూపర్‌వైజర్ (మహిళలు)లకు మంగళవారం పబ్లిక్ హెల్త్ నర్సు (నాన్ టీచింగ్) కడప ఆర్డీ డా. రామగిడ్డయ్య పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏడుగురు పీహెచ్‌ఎన్‌లుగా పదోన్నతులు పొందారు. సి. రామక్క (హొళగుంద పీహెచ్‌సీ) ఏ.డీ. ఇందిర (పలుకూరు) ఆర్. ప్రభావతి (కొత్తపల్లి), మాణిక్యమ్మ (మద్దూరు పీహెచ్‌సీ), ఎస్. నాగలక్ష్మమ్మ (వెల్లునూరు పీహెచ్‌సీ) హేమలత (బి. పప్పూరు పీహెచ్‌సీ, అనంతపురం), టి. శ్యామలదేవి (పలుతూరు పీహెచ్‌సీ, అనంతపురం) స్థానాలను కేటాయించారు. మరో ఇద్దరు ఫిమేల్ హెల్త్ సూపర్‌వైజర్లు పదోన్నతులు తీసుకోలేదు.

భర్త హత్య కేసులో అరెస్టు

గోనెగండ్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల క్రితం భర్త సురేష్ కంట్లో కారం చల్లి ఒంటి పై పెట్రోల్ పోసి నిప్పు అంటించి హత్యచేసిన భార్య చిట్టెమ్మను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలు.. మంగళవారం చిట్టెమ్మ హత్య జరిగి ఇంటి పరసరాల్లో సంచరిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. గోనెగండ్లకు చెందిన బలిజ సురేష్‌కు భార్య చిట్టెమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా సురేష్ భార్యను వేధించేవాడు. గత గురువారం రాత్రి అతడు భార్యతతో గొడవపడ్డాడు. రాత్రి ఏమి జరిగిందో ఏమో నిప్పు అంటుకొని సురేష్ కేకలు వేయడం మొదలుపెట్టాడు. కాలనీవాసులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి నాగమ్మ శుక్రవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ విజయభాస్కర్ విచారణ చేపట్టారు. భార్యే హత్య చేసినట్లు నిర్ధారించుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బంగారుపేటలో ఎక్సైజ్ దాడులు

కర్నూలు అర్బన్/క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బంగారుపేటలో సారా, బెల్లం ఊట నిల్వలను పోలీసులు ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం ఎక్సైజ్ అసిస్టెం ట్ కమిషనర్ హనుమం తరావు, సూపరింటెండెంట్ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 'నవోదయం'ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో సారా స్థావరాలపె ఐదు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా దాడులు చేశారు. 65 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని 1,350 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు సారాతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. సారా తయారీ, విక్రయాలు మాను కోవాలని కోరారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్‌గౌడ్, నగర సీఐలు నాగరాజారావు, మన్సూరుద్దీన్, నాగశేఖర్, ఎక్సైజ్ సీఐలు చంద్రహాస్, జయరాంనాయుడు, క్రిష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిపరులపై చర్యలకు ఆదేశాలు

నంద్యాల టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అవినీతిపరులపై కొరడా ఝళిపించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఏసీబీ ఇచ్చిన ఆధారాల మేరకు మంగళవారం మున్సిపల్, అర్బన్ డెవలెప్‌మెంట్ వారు అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నంద్యాల మున్సిపాలిటీలో 2023 జనవరిలో రెండు రోజులు టౌన్ ప్లానింగ్ పలు విభాగాల్లో సోదాలు నిర్వహించారు. అప్పటి ఏసీపీ వల్లూరి సుజన్‌మోహన్ నరసింహమూర్తితో పాటు 10మందిపై అధికారిక పనుల్లో అవినీతి, భవననిర్మాణంలో, అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, ధృవపత్రాలు జారీ చేయడంలో అవినీతిపై రామకృష్ణుడు ఏసీపీ, రంగస్వామి టీపీవో, రాణెమ్మ పీపీఎస్, బాలమద్దయ్య టీపీఎస్, రిజ్వానా టీపీబీవో, శబరీస్ టీపీబీవో, కృష్ణ సీనియర్ అసిస్టెంట్, ఉమా మహేశ్వరరావు టౌన్ సర్వేయర్, రవిచంద్రారెడ్డి కమిషనర్, రామచంద్రారెడ్డి కమిషనర్. వీరికి కొన్ని నెలల కిందట నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు చర్యలకు సిద్ధమయ్యారు.

మార్కెట్ యార్డులో వరి కొనుగోళ్లు



వరి ధాన్యాన్ని తూకం వేస్తున్న హమాలీలు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేసీ కెనాల్, ఎల్లెల్సీ, ఎస్సార్బీసీ, తెలుగుగంగ, తదితర ప్రధాన కాలువలు, చెరువుల కింద దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో వరి పంట సాగవుతున్నా ప్రభుత్వ స్థాయిలో ఉమ్మడి జిల్లాలో ఏ మార్కెట్ కమిటీ యార్డులోనూ ధాన్యం విక్రయాలు చేపట్టలేదు. ఇటీవలే కర్నూలు మార్కెట్ యార్డులో ధాన్యం విక్రయాలను చేపట్టారు. దీనివల్ల రైతులకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర దక్కడంతో పాటు ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు మార్కెట్ కమిటీ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఇందులో భాగంగా కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు మార్కెట్ యార్డులో ధాన్యం విక్రయాలను చేపట్టామని, ఈ అవకాశాన్ని ధాన్యం పండించే రైతులంతా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వేసవి సెలవులకు ఇంటికి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు దుర్మరణం
- కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు



మృతి చెందిన శ్రావణి, వడ్డె ఈరన్న(ఫైల్)

విలపించిన భార్యాపిల్లలు

తన భర్త, కూతురు ఊరికి వస్తుండగా రోడ్డుప్రమాదంలో మృతి చెందారని పోలీసుల నుంచి ఫోన్ రావడంతో ఒక్కసారిగా భార్య రాధమ్మ పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు. బోరున విలపిస్తూ ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రిలో పోస్టుమార్టం గదిలో విగతజీవులై పడి ఉండటం చూసి రోదించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది.



రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

ఆలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులకని కూతురిని తీసుకొని ఇంటికి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన మంగళవారం మండలంలోని పెద్ద హోతూరు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... ఆస్పరి మండలం మూత్కూరుకి చెందిన ఈరన్న వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య రాధమ్మతో పాటు ముగ్గురు కుమార్తెలు, ఒక్క కుమారుడు సంతానం. పెద్ద కూతురు ఇందు తల్లివెంట కూలీ పనికి వెళ్తుంది. రెండో కూతురు శ్రావణి చిప్పగిరి కస్తూర్బా స్కూల్‌లో 9వ తరగతి చదువుతుంది. మంగళవారం శ్రావణిని తీసుకొని స్వగ్రామానికి ఈరన్న బయలుదేరాడు. మండ లంలోని పెద్ద హోతూరు సమీపంలోని గోకుల్ సిమెంట్ మిక్స్ లారీ, బైక్ ఢీకొన్నది. తండ్రీ కూతురు లారీ టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతిచెందారు. శ్రావణి చదువులో మంచి ప్రతిభ కనబరచేదని ఉపాధ్యాయులు తెలిపారు. ఉదయం అందరికి బైబై చెప్పి వెళ్లిందని ఇంతలో ఇలాంటి మరణ వార్త విద్యార్థులను స్నేహితులను కలచివేసింది

బాధిత కుటుంబాన్ని ఓదార్చిన ఎమ్మెల్యే

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విరుపాక్షి ఆలూరు ఆసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వం వడ్డే ఈరన్న కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే విరుపాక్షి, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున డిమాండ్ చేశారు.

మట్టిలో కూరుకుపోయి.. కార్మికుల దుర్మరణం

- భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదం
- గూడూరులో విషాదం
- ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున నష్ట పరిహారమివ్వాలి : సీపీఎం మండల కార్యదర్శి





కార్మికులను బయటకు తీస్తున్న స్థానికులు

గూడూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మట్టి పనులు చేస్తూ జరిగిన ప్రమాదంలో ఇద్దరు భవన నిర్మాణకార్మికులు దుర్మరణం చెందారు. ఈ ఘటన గూడూరు నగర పంచాయతీలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో ఓ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పునాదుల మట్టి పనుల్లో మధు(25), సోమన్న(35) పాటు మరి కొందరు కార్మికులు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో పునాది మట్టి తీస్తుండగా పైన ఉన్న మట్టి పెల్లలు భవన నిర్మాణ కార్మికులు మధు, సోమన్న ఇద్దరిపై పడ్డాయి. ఇద్దరు కార్మికులు మట్టిలో కూరుకుపోయారు. ఇది గమనించిన తోటి కార్మికులు హుటాహుటిన మట్టిలో కూరుకు పోయినవారిని బయటకు తీసే ప్రయత్నం చేశారు. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని బయటకు తీయగా వారు అప్పటికే అపస్మారకస్థితికి చేరారు. పెంచికలపాడు దగ్గర ఉన్న ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఇద్దరు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మధుకు ఏడాది క్రితమే వివాహమైంది. భవన నిర్మాణ పనులు చేస్తు జీవనం చేస్తున్నాడు. సోమన్నకు భార్యతో పాటు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రమాద ఘటనను తెలుసుకున్న ఎస్‌ఐ తిమ్మయ్య ఘటనాస్థలిని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ.25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలి: గూడూరులో పునాదులు తీస్తుండగా పై నుండి మట్టి కుప్పలు పడి ఇద్దరు భవన నిర్మాణ మృతి చెందగా ఒక్కో కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి జే మోహన్ డిమాండ్ చేశారు.

బంగారు బిస్కెట్లు స్వాధీనం

- విలువ సుమారు రూ.60 లక్షలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు

ఆదోని, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.60 లక్షలు విలువ చేసే 6 బంగారు బిస్కెట్ల(600 గ్రాములు)ను టూ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపిన వివరాలివీ.. ఆదోని పట్టణంలోని ఎంఐజీ కాలనీకి చెందిన మహమ్మద్ ఫజల్ ప్రొద్దుటూరు నుంచి కారులో ఆదోనికి బంగారు బిస్కెట్లు తీసుకొస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సోమవారం రాత్రి ఆదోని పట్టణ సమీపంలో ఆస్పరి బైపాస్‌లో కారును నిలిపివేసి మహమ్మద్ ఫజల్ నుంచి బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకొని, కారు, సెల్‌ఫోనును సీజ్ చేసినట్లు తెలిపారు. బంగారుకు సంబంధించిన బిల్లులు లేకపోవడం వల్ల స్వాధీనం చేసుకొని ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పచెప్పినట్లు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం ఆదివాసులపై యుద్ధాన్ని ఆపి శాంతి చర్చలు జరపాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న విరసం రాష్ట్ర నాయకుడు పాణి

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆదివాసులు, మావోయిస్టులపై జరుగుతున్న అమానవీయ యుద్ధాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిలిపివేయాలని విరసం రాష్ట్ర నాయకుడు పాణి అన్నారు. మంగళవారం ప్రఖ్యాత విప్లవ నాయకుడు లెనిన్ 155వ జయంతి సందర్భంగా ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నగరంలోని సీపీఐ కార్యాలయంలో సభను నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆదివాసీలపై జరుగుతున్న యుద్ధం - కాల్పుల విరమణ - శాంతి చర్చలు' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 6 గంటల నుంచి చత్తీస్‌ఘడ్-తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టు నాయకులను టార్గెట్ చేసుకొని పదివేల సైనికులు చుట్టుముట్టారని, హెలికాప్టర్లు, డ్రోన్లతో బాంబింగ్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని అన్నారు. ఈ యుద్ధాన్ని ఆపి శాంతి చర్చలకు ప్రభుత్వం సిద్ధం కావాలని కోరారు. 'వక్ఫ్ సవరణ చట్టం - రాజ్యాంగ ఉల్లంఘనలు' అనే అంశంపై ఎస్‌డీపీఐ రాష్ట్ర నాయకుడు ఫాజిల్ దేశాయ్ మాట్లాడుతూ ముస్లింలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో సవరణ చేస్తున్నదని, దీన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. 'లెనిన్-సోషలిజం నేటి ప్రాంసగికత' అనే అంశంపై ప్రజాభ్యుదయ సంస్థ నాయకుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ తొలి సోషలిస్టు విప్లవ నాయకుడు లెనిన్ స్ఫూర్తితో మన దేశ పరిస్థితులను అర్థం చేసుకొని ప్రజా పోరాటాలు నిర్వహించాలని అన్నారు. ఈ సభలో ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, పౌర హక్కుల సంఘం నాయకుడు అల్లాబకాష్, రాయలసీమ విద్యావంతుల వేదిక కోకన్వీనర్ రత్నం ఏసేపు తదితరులు ప్రసంగించారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక

కర్నూలు క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోలీసు క్రీడలకు క్రీడాకారులను ఎంపిక ప్రక్రియ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆయా రేంజ్‌ల నుంచి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేస్తారు ఈ సందర్భంగా కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో కర్నూలు రేంజ్ (కర్నూలు, కడప, నంద్యాల, అన్నమయ్య) జిల్లాల నుంచి పోలీసులకు నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో క్రీడా పోటీలు ఎంపిక మూడు రోజులు పాటు జరుగనున్నాయి. ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, షటిల్, రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, క్రికెట్, బాస్కెట్‌బాల్ వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ ఈ క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ భాస్కర్‌రావు, ఆర్ఐలు, కర్నూలు, నంద్యాల కడప, అన్నమయ్య జిల్లాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బీఈడీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 23 నుంచి 29 వరకు జరుగుతాయని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 19 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాసేందుకు రెగ్యులర్ 3,537, సప్లమెంటరీ విభాగంలో 545 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు.

ఉపాధి కూలీ బకాయిలు త్వరలో జమ

- డ్వామా పీడీలు వెంకట రమణ, వెంకట సుబ్బయ్య



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సిన రూ.961.46 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, వీటిని జిల్లాల వారీగా కేటాయింపులు చేసి త్వరలోనే ఉపాధి పనులు చేస్తున్న కూలీల బ్యాంకు అకౌంట్లకు జమ చేయనున్నట్లు ఉమ్మడి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్లు వెంకటరమణ, వెంకట సుబ్బయ్య తెలిపారు. ఫిబ్రవరి నుంచి కూలీలకు రావాల్సిన బకాయిలు కొద్ది రోజుల్లోనే వారి ఖాతాలకు జమ కానున్నాయి. కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలంటూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ ఇటీవల పలు మార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర అధికారులకు విజ్ఞప్తి చేశారని, ఈ క్రమంలోనే కూలీల వేతనాలు విడుదలైనట్లు స్పష్టం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేతన బకాయిలు దాదాపు రూ.150 కోట్ల దాకా రావాల్సి ఉందని ఈ వేతన బకాయిలు అందిన వెంటనే మెటీరియల్ కాంపొనెంట్ కింద రావాల్సిన నిధులు కూడా త్వరలోనే మంజూరవుతాయని నీటి యాజమాన్య సంస్థ అధికార వర్గాలు తెలిపాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బండిఆత్మకూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడమల కాల్వకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. మంగళవారం ఉదయం కృష్ణనంది సమీపంలోని అటవీప్రాంతంలో వట్టి కర్రలు తెచ్చుకునేందుకు పెద్ద వెంకటస్వామి ట్రాలీ ఆటోలో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో దర్గా వద్ద ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొంది. అందులో ప్రయా ణిస్తున్న పెద్ద వెంకస్వామి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తమ్ముడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మిడుతూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలముడిపి గ్రామంలో ఒక యువకుడు మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన బోయ రవికుమార్(26) పెళ్లి కాలేదని, అనారోగ్య కారణాలతో మనస్తాపం చెంది ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మ హత్యయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు మిడుతూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే రవికుమార్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి బోయ రంగస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఓబులేసు కేసు నమోదు చేసి శవపరీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

మహానందిలో భక్తుడు..

మహానంది, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రానికి దైవదర్శనం కోసం వచ్చిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన మాల భోజరాజు(37) ఆలయం వెనుక వైపు మంచినీళ్ల ట్యాంక్ పైభాగంలోని సిమెంట్ దిన్నెకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేట జిల్లా మల్లుపల్లి గ్రామానికి చెందిన మాల భోజరాజు తన మిత్రులతో కలసి ఈనెల 15న పుణ్య క్షేత్రాలను దర్శించేందుకు టూరిస్టు బస్సులో బయలు దేరారు. మంగళవారం మహానందికి చేరుకున్నాక భోజరాజు బహిర్భూమికి వెళ్తున్నట్లు మిత్రులకు చెప్పి ఆలయం వెనుక వైపుకు వెళ్లి ఉరేసుకున్నాడు. సంఘటన స్థలానికి మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తన సిబ్బందితో వెళ్లి భోజరాజు మృతదేహాన్ని ట్యాంక్ నుంచి కిందకు దించారు. పోస్టుమార్టం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భక్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

జూన్‌లో ఏపీ పీజీ సెట్

- మే 5వరకు దరఖాస్తులకు గడువు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆర్‌యూ పరిధిలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల విద్యార్థుల కోసం ఏపీపీజీ సెట్-2005 పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎకానామిక్స్ డిపార్టుమెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 5 లోపు దరఖాస్తులకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎకనామిక్స్‌లో చేరడానికి డిగ్రీలో బీఏ ఫైనల్ సెమిస్టర్ చదువుతున్న వారితో పాటు, డిగ్రీ పూర్తి చేసుకున్నవారు ఎంఏ ఎకనామిక్స్ కోర్సులో ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాభివృద్ధితో పాటు కంప్యూటర్ కోర్సును కూడా ఎకనామిక్స్ సిలబస్‌లో భాగంగా నేర్చుకునే అవకాశముందని సూచించారు.

కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి



కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహనాయక్

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహనాయక్ కోరారు. మంగళవారం మం డలంలోని వడ్లరామాపురం గ్రామంలో జరుగుతున్న పని ప్రదేశాలను పరిశీలించి ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీల పని ప్రదేశాల్లో టెంట్లు లేక పోవడంతో అక్కడ ఉన్న చెట్ల నీడలోనే ఉంటున్నారన్నారు. దీంతో పలువురు కూలీలు వడదెబ్బ సోకి అస్వస్థతకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేసి, తాగునీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

వరి రైతు వ్యథ

- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని ప్రభుత్వం
- మద్దతు ధర లేక రైతుల ఇక్కట్లు
- తేమశాతం చూపుతూ దళారుల దోపిడీ



సంతజూటూరు కల్లంలో ఆరబోసిన వరి ధాన్యం

బండిఆత్మకూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రబీ వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కరువైంది. ధాన్యాన్ని కొనవారు లేక కళ్లాల వద్ద, రోడ్లపైనే ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిల్ చేసుకునేందుకు గోదాలు కూడా లేవు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకునే దాఖలాలు లేవు. దళారులకు విక్రయిస్తే పెట్టిన పెట్టుబడులు కూడా రావని రైతులు వాపోతున్నారు. మండలంలోని 24 గ్రామాల్లో రబీ సీజన్ కింద సుమారు 20 వేల ఎకరాలకు పైగానే కేసీ కెనాల్, తెలుగుగంగ, కుందూనది కింద అన్నదాతలు వరి పంట సాగు చేశారు. ఎకరాకు పెట్టుబడి రూ.30 వేల వరకు పెట్టారు. పంట దిగుబడి ఎకరాకు సగటున 40 బస్తాల మేర దిగుబడి వచ్చింది. అయితే పంటకోత కొన్ని గ్రామాల్లో ముమ్మరంగా సాగుతోంది. వరి ధాన్యం మద్దతు ధరలు మొదట్లో కొన్ని బోట్ల క్వింటాళ్లు 2000 మేర కొనుగోళ్లు చేశారు. నేడు గ్రామాల్లో రూ.1750 మించి కొనుగోళ్లు చేయటం లేదు. దీంతో గ్రామాల్లో ధర లేక రైతులు వరి ధాన్యాన్ని ఆరబోసుకోవాల్సి వస్తోంది. దీనికి తోడు గత 10 రోజులుగా అకాల వర్షాలు, గాలుల కారణంగా కొన్ని పంటలు నేలవాలి తీవ్రంగా నష్టపోతున్నారు. మరి కొంత మంది రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాములు లేక తడిసిపోయాయి. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



తాను సొంత భూమి 5 ఎకరాలు, కౌలుకు 5 ఎకరాల భూమిలో వరి పంట రబీలో సాగు చేశాను. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా వరి ధాన్యాన్ని దళారులు 78 కేజీల బస్తా రూ.1350కి అడుగుతున్నారు. ఈ ధర గిట్టుబాటు కాదు. ప్రభుత్వమే గిట్టుబాటు ధర ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలు పెట్టి తక్షణమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

- అర్లగడ్డ శివశంకరయ్య, రైతు, పెద్దదేవళాపురం



మద్దతు ధర కల్పించాలి

బండిఆత్మకూరు, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యానికి ప్రభుత్వం తక్షణమే మద్దతు ధర కల్పించాలని వ్యకాస నాయకులు డేవిడ్, రాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రామాపురం, సంతజూటూరు, బండిఆత్మకూరు గ్రామాల్లో ఆరబోసిన వరిధాన్యపు రాశులను వారు పరిశీలించారు. దళారుల దెబ్బకు వరి రైతులు ధాన్యాలు అమ్ముకోలేకపోతున్నారని, కనీసం క్వింటాలుకు రూ.2200 మద్దతు ధర ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.



రామాపురంలో వరి ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

కొలను భారతి అభివృద్ధికి సహకరించాలి

- కలెక్టర్‌ను కోరిన శివయోగేంద్ర సరస్వతి స్వామీజీ



కలెక్టర్ రాజకుమారితో మాట్లాడుతున్న శివయోగేంద్ర సరస్వతి స్వామీజీ

కొత్తపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కొలనుభారతి అభివృద్ధికి సహకరించాలని కాకనూరు శారదా మఠం పీఠాధిపతి శివ యోగేంద్ర సరస్వతి స్వామీజీ కలెక్టర్ రాజకుమారి గనియాను కోరారు. మంగళవారం స్వామీజీ నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం స్వామీజీ కలెక్టర్‌తో మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకైక స్వయంభూ క్షేత్రమైన కొలనుభారతి అభివృద్ధికి నోచుకోకపోవడంతో భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని అన్నారు. క్షేత్ర అభివృద్ధి కోసం ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహకరించాలని, క్షేత్రానికి దేవాదాయ శాఖ నుంచి రెగ్యులర్ ఈవోను నియమించాలని కోరారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ క్షేత్ర అభివృద్ధికి ప్ర భుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు స్వామీజీ తెలిపారు.

26 నుంచి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా గ్రామీణ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 26, 27తేదీల్లో పాణ్యం మండలం తొగర్చేడు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జగన్నాథరెడ్డి, అశోకకుమార్‌రెడ్డిలు తెలిపారు. విజేతలకు రూ.12వేలు, రూ.8వేలు, రూ5, వేలు, రూ.4వేలు, రూ.3వేల చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. గ్రామీణ క్రీడాకారులకు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. క్రీడాకారులకు భోజన, వసతి కల్పించనున్నారు. తొగర్చేడు బాల్‌బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు.

అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం కర్ణాటక రాష్ట్రం, మంగళూరుకు చెందిన శైలజ అనే భక్తురాలు రూ. 1లక్షలు విరాళాన్ని పర్యవేక్షకులు జి. రవికి అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు తగు రశీదు, స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.



భక్తురాలికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న పర్యవేక్షకుడు రవి

డీఎంహెచ్‌ఓ కార్యాలయం ముందు సీహెచ్‌వోల ధర్నా

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జీజీహెచ్‌లోని జిల్లా వైద్యాధికారి కార్యాలయం ముందు మంగళవారం సీహెచ్‌ఓలు ధర్నా చేశారు. రాష్ట్ర మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్స్ పిలుపు మేరకు సీహెచ్‌ఓల హక్కుల కోసం ఈ ధర్నా నిర్వహించారు. సీహెచ్‌ఓలకు ఆయుష్మాన్‌భారత్ నిబంధనల మేరకు ఉద్యోగభద్రత కల్పించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలని డిమాండ్ చేశారు. అలాగే ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, ఇన్సెంటివ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అందించాలని డిమాండ్ చేశారు. ఎన్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌ఓలను మినహాయించాలని, హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు అమలు చేయాలన్నారు. జిల్లాలో దాదాపు 350మంది కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్లు పనిచేస్తున్నారని అన్నారు.



ధర్నా చేస్తున్న సీహెచ్‌వోలు

- షోకాజ్ నోటీసులిచ్చాం, జీతాలు ఆపాలని ఆదేశాలు

జిల్లాలో 369మంది కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్లకుగాను 350మంది పనిచేస్తున్నారని గత కొన్ని రోజులనుంచి విధులకు హాజరుకాకుండా సమ్మెలో ఉన్నారు. 350మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చాం. వారం రోజుల్లోపల విధులకు హాజరు కావాలి. జీతాలు నిలుపుదల చేయమని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి.

- డీఎంహెచ్‌వో

అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

నంద్యాల క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశించారు. మంగళవారం ఆయన నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లోని పోలీస్ అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేరనియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలను ప్రాధాన్యతా క్రమంలో వివరించారు. పెండింగ్ కేసులు వాటి స్థితిగతులను క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం (సీసీటీఎన్ఎస్)లో అప్‌లోడ్ చేసిన వాటి ఆధారంగా సమీక్షించారు. కేసు ల్లో నిందితుల అరెస్ట్, కేసుల దర్యాప్తు, వాటి వివరాలు, పురోగతిపై ఆరా తీసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాల నియంత్రణతో పాటు నేరస్థులను పట్టుకోవాలన్నారు. స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాల్లో ప్రతి అంశాన్ని సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. గ్రేవ్ కేసులు, యువ కేసులు, పీడీకేసులు, మర్డర్, సైబర్‌క్రైమ్ కేసులు, పోక్సో కేసులు, మిస్సింగ్, ఎస్సీ, ఎస్టీ కేసులపై ఆరాతీస్తూ దర్యాప్తును వే గవంతం చేసి నిందితులకు శిక్ష పడేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. బాలురు, బాలికల మిస్సింగ్ కేసుల విష యాల్లో వేగంగా స్పందించి వారి ఆచూకీ తెలుసుకొని తల్లిదండ్రులకు అ ప్పగించేలా పనిచేయాలని సూచించారు. మిస్సింగ్, అన్ ఐడెంటిఫైడ్ డెడ్ బాడీ కేసుల్లో క్రిమినల్ ఇంటలిజెన్స్ సిస్టం (సీఐఎస్) అప్లికేషన్‌లో ఎప్పటికప్పుడు చెక్ చేసుకొని కేసుల్లో పురోగతి సాధించాలన్నారు. మహి ళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌డీపీఎస్, పోక్సో కేసుల్లో నిందితులపై నిఘా వేయడంతోపాటు అవసరమైతే రౌడీషీట్ ఓపెన్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గ్రామ ప్రారంభంలో, గ్రామ చివరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా బార్డర్, బోర్డర్లలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి, అక్రమ మద్యం, పీడీఎస్ రైస్ ఇతర నిషేధిత అక్రమ రవాణాను అడ్డుకోవాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై దృష్టిసారించి ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించి సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, శక్తియాప్, నేర నియంత్రణ, శాంతిభద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌కు సంబంధించిన వాహనాల పనితీరు, నిర్వహణను పరిశీలించి ఎల్లప్పుడు వాహనాలను కండిషన్‌లో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

పాఠశాల విద్యావ్యవస్థలో గందరగోళ పరిస్థితులు



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు

గడివేముల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యావ్యవస్థలో ప్రభుత్వం తీసుకొస్తున్న అనాలోచితమైన విధానాలతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు రవి, మునిస్వాములు పేర్కొన్నారు. మండలంలోని గడిగరేవుల హైస్కూల్‌లో మంగళవారం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 ఉత్తర్వులను రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వం అందుకు భిన్నంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,557 ఉన్నత పాఠశాలలు 1 నుంచి 10వ తరగతి వరకు కొనసాగించాలని నిర్ణయించడం సరైన విధానం కాదని అన్నారు. ఉన్నత పాఠశాలలో ప్రాథమిక తరగతులను విలీనం చేయడాన్ని విరమించుకోవాలని అన్నారు. జూన్‌లో జరిగే డీఎస్సీ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో 30 రోజుల పాటు నియామక పరీక్షలు నిర్వహించడం సరైనది కాదని అన్నారు. దీని వల్ల కొంత మంది విద్యార్థులకు నష్టం జరిగే అవకాశం ఉందని అన్నారు. ఓఎంఆర్ షీట్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు పరీక్షలు నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగాల బాలస్వామి, రాంపుల్లారెడ్డి పాల్గొన్నారు.

మూలపెద్దమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

గడివేముల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూలపెద్దమ్మ ఆలయంలోని తాత్కాలిక హుండీలను మంగళవారం పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. ఉగాది సందర్భంగా భక్తులు చెల్లించిన ముడుపులు లెక్కించగా రూ.76,084 ఆదాయం వచ్చిందని అన్నారు. చందాల ద్వారా రూ.21,800, సేవా టికెట్ల ద్వారా రూ.17,885 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి రామలింగారెడ్డి తెలిపారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

'ఉపాధి'లో పండ్ల తోటల సాగు చేపట్టండి



మాట్లాడుతున్న ఏపీవో వెంకటరమణ

గడివేముల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో రైతులు పండ్లతోటలు సాగు చేసేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వాసుదేవగుప్త జాతీయ ఉపాధిహామీ పథకం సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయన ఉపాధిహామీ పథకం సిబ్బందితో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ పండ్ల తోటలు సాగులో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చని అన్నారు. అనంతరం ఏపీవో వెంకటరమణ సిబ్బందికి ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి దివ్య, ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

గతుకులకు అతుకులు పడేదెన్నడు?

- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- గుంతల రోడ్లతో ఇక్కట్లకు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఆత్మకూరు నుంచి దుద్యాలకు వెళ్లే గుంతల రోడ్డు ఇదే



కొత్తపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా నేటికీ కూడా పనులు ప్రారంభించలేదు. కొత్తపల్లి మండలంలోని ఆత్మకూరు నుంచి దుద్యాల, కొక్కెమాడుగుల, కొక్కెరంచ గ్రామాలకు 13 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.1.20 కోట్ల నాబార్డు నిధులు మంజూరు చేసిందని అధికారులు చెబుతున్నారు. అయితే.. అధికారుల నిర్లక్ష్యమో.. లేక నిధుల మంజూరులో జాప్యం జరుగుతుందో తెలియదు కానీ.. ఇంత వరకు పనులు ప్రారంభించడం లేదన్నారు. దీంతో గతుకుల రోడ్డుపై గమ్యానికి చేరుకోవాలంటే ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. రాత్రివేళల్లో ద్విచక్రవాహనదారులు గుంతల్లో అదుపు తప్పి కింద పడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. గత రెండేళ్ల క్రితం నిధులు మంజూరైనట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పారే తప్ప.. నేటికీ కూడా పనులు మాత్రం మొదలు పెట్టలేదు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపి రోడ్డు మరమ్మతులకు చొరవ చూపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అలాగే మండలంలోని నందికుంట, దుద్యాల, పెద్ద గుమ్మడాపురం, చిన్న గుమ్మడాపురం, గువ్వలకుంట్ల, పాలెంచెరువు, సింగరాజుపల్లి, మునుసిమడుగు గ్రామాల రహదారులు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయని, వీటికి కూడా అధికారులు ప్రతిపాదనలు పంపించామని చెబుతున్నారు కానీ.. నేటికీ కూడా నిధులు మంజూరు కాలేదు. ఈ విషయంపై నందికొట్కూరు డివిజన్ పీఆర్ డీఈ రామ్మోహన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. నిధులు మంజూరైనా మాట వాస్తవమేనని చెప్పారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరిగిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

ఇబ్బందులు పడుతున్నాం



ఆత్మకూరు నుంచి దుద్యాల వరకు పూర్తిగా రోడ్డు దెబ్బతిన్నది. మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం మంజూరు చేసినా అధికారులు పనులు ఎందుకు ప్రారంభించడం లేదో తెలియడం లేదు. గుంతల రోడ్లపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది.

- కనక నాగన్న, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు, దుద్యాల

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నందికొట్కూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): దేశంలో భారతీయ జనతా పార్టీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదామని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వాల్మీకి నగర్ వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఆరాచక పాలనకు బుద్ధి చెప్పే పరిస్థితులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు వాడాల శ్రీనివాసులు, వేల్పుల ఏసన్న, నరసింహుడు, రామకృష్ణ, బాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

లెనిన్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

నంద్యాల రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విప్లవ యోధుడు లెనిన్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ కోరారు. మంగళవారం లెనిన్ 155 జయంతిని పురస్కరించుకొని సీపీఎం కార్యాలయంలో లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా ప్రజాతంత్ర హక్కుల కోసం పోరాటాలని లెనిన్ సూచించారని చెప్పారు. కార్మిక, కర్షక, ఐక్యత గురించి విప్లవ కార్యాచరణలో పార్టీ నిర్మాణ ఆవశ్యకతను వివరించినట్లు తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ అనుసరించే విధానం వల్ల పెరిగే అసమానతలపై వెనకబడిన దేశాల్లో కూడా సోషలిజం సాధించడం సాధ్యమేనని లెనిన్ నిరూపించినట్లు గుర్తుచేశారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు తోట మద్దులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు, వెంకటలింగం, మహమ్మద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారి వ్యవస్థ వల్ల పీడిత వర్గాలు దోపిడికి గురయ్యే ప్రమాదం ఉందని సీపీఎం నాయకులు నరసింహనాయక్, స్వాములు పేర్కొన్నారు. మంగళవారం లెనిన్ 155వ జయంతిని పురస్కరించుకొని స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాబాషా, రామ్‌నాయక్, సద్దాం, శ్రీను, సంజీవ తదితరులు ఉన్నారు.



ఆత్మకూరులో లెనిన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా
- ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో సమీక్ష

నంద్యాల క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశించారు. మంగళవారం ఆయన నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లోని పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేరనియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలను ప్రాధాన్యత క్రమంలో వివరించారు. పెండింగ్ కేసులు వాటి స్థితిగతులను క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం (సీసీటీఎన్ఎస్)లో అప్‌లోడ్ చేసిన వాటి ఆధారంగా సమీక్షించారు. కేసుల్లో నిందితుల అరెస్ట్, కేసుల దర్యాప్తు, వాటి వివరాలు, పురోగతిపై ఆరా తీసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను పట్టుకోవాలన్నారు. స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాల్లో ప్రతి అంశాన్ని సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. గ్రేవ్ కేసులు, యువ కేసులు, పీటీకేసులు, మర్డర్, సైబర్‌క్రైం కేసులు, పోక్సో కేసులు, మిస్సింగ్, ఎస్సీ, ఎస్టీ కేసులపై ఆరాతీస్తూ దర్యాప్తును వేగవంతం చేసి నిందితులకు శిక్ష పడేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. బాలురు, బాలికల మిస్సింగ్ కేసుల విషయాల్లో వేగంగా స్పందించి వారి ఆచూకీ తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించేలా పనిచేయాలని సూచించారు. మిస్సింగ్, అన్ ఐడెంటిఫైడ్ డెడ్ బాడీ కేసుల్లో క్రిమినల్ ఇంటెలిజెన్స్ సిస్టం (సీఐఎస్) అప్లికేషన్‌లో ఎప్పటికప్పుడు చెక్ చేసుకుని కేసుల్లో పురోగతి సాధించాలన్నారు. మహిళలపై జరుగుతున్న అమానుషాలపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌డీపీఎస్, పోక్సో కేసుల్లో నిందితులపై నిఘా వేయడంతోపాటు అవసరమైతే రౌడీషీట్ ఓపెన్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గ్రామ ప్రాంగణంలో, గ్రామం చివరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా బార్డర్, టోల్‌గేట్లలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి, అక్రమ మద్యం, పీడీఎస్ రైస్ ఇతర నిషేధిత అక్రమ రవాణాను అడ్డుకోవాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై దృష్టిసారించి ప్రతిరోజు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించి సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, శక్తియాప్, నేర నియంత్రణ, శాంతిభద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌కు సంబంధించిన వాహనాల పనితీరు, నిర్వహణను పరిశీలించి ఎల్లప్పుడూ వాహనాలను కండిషన్‌లో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఏఆర్‌అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

ధరిత్రి జనయిత్రి

- ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు

రుద్రవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ధరిత్రి జనయిత్రి అని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవ వేడుకలు ఆదర్శ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భూమిని కాపాడుకుంటేనే మనిషి భవిష్యత్ బాగుంటుందన్నారు. వృక్షాల సమాచారం సేకరించి ప్రతి వృక్షానికి సంబంధించిన సమాచారం క్యూఆర్ కోడ్ రూపంలో ప్రదర్శించామన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించామన్నారు. ఆటు భూమి, ఇటు వృక్షాలను కాపాడడం ప్రతి మనిషి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్, పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.


ప్లకార్డులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆళ్లగడ్డ: పట్టణంలోని ప్రజ్ఞా పాఠశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు అమీర్‌బాషా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అమీర్‌బాషా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజ్ఞా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు

చాగలమర్రి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పెనుగాలుల బీభత్సంతో విరిగి పడ్డ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ ఏఈ రమణయ్య మంగళవారం తెలిపారు. విద్యుత్‌శాఖకు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని అన్నారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాల్లో విద్యుత్ సమస్య లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని ఏఈ అన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

బనగానపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జుర్రేరు వాగులో అక్రమ కట్టడాన్ని మంగళవారం అధికారులు కూల్చివేశారు. వైఎస్‌పీకి చెందిన శివ గౌడ ప్రభుత్వంలో ఆక్రమించుకున్న కబ్జా ఆక్రమంగా ఇంటిని నిర్మించుకున్నారు. తహసీల్దార్ నారాయణరెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్‌రెడ్డి, ఈవో సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో కట్టడా న్ని కూల్చివేశారు. ఇంకా అనేక అక్రమ కట్టడాలు జుర్రేరు వాగులో ఉన్నాయని, నోటీసులు ఇచ్చి కూల్చివేయనున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో రైతు కూలీ మృతి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఓ మహిళా రైతు కూలీ మృతి చెందిన ఘటన కోవెలకుంట్లలో చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాలు.. మండలంలోని భీమునిపాడుకు చెందిన పిడతల సారమ్మ (65) అనే మహిళా రైతు కూలీ మిరప పంట కోసేందుకు మంగళవారం వెళ్లింది. కాగా, గుండెల్లో నొప్పి రావడంతో కోవెలకుంట్లలోని ఓప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంది. గుండె సమస్య ఉందని వైద్యులు తెలిపారు. ఇంటికి వెళ్తుండగా మూర్ఛ వచ్చి కింద పడిపోయి మృతి చెందింది. విషయం తెలుసుకున్న బంధువులు కోవెలకుంట్ల చేరుకుని మృతురాలిని భీమునిపాడుకు తరలించారు. సారమ్మకు భర్త ఓబులేసుతో పాటు ముగ్గురు ఆడపిల్లలు, ఒక కొడుకు ఉన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

బేతంచెర్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఏపీ రైతు సంఘం కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి గోర్లగుట్ట, ముసలాయిచెరువు, గూటుపల్లెతండా, రెహిమాన్‌పురం, గ్రామాల రైతులతో కలిసి గ్రామాల్లో పర్యటించారు. రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో బీజే వెల్పాతి, అల్లకుంట మద్దు, సీనారాయణరెడ్డి, హేమనాథరెడ్డి, మద్దు, జజి నాగమద్దయ్య శ్రీనివాసులు, సిహెచ్ మద్దిలేటిస్వామి, మునిస్వామి, పెద్ద బాల నాగయ్య, చిన్నబాల నాగయ్య శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

25న మండల సర్వసభ్య సమావేశం

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 25న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి మంగళవారం తెలిపారు. ఎంపీపీ నాగేసని అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొనాలన్నారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదిక లతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

సారా స్వాధీనం

డోన్ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): డోన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ప్యాపిలి మండలం అలేబాదు తండా గ్రామంలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామంలో రమేష్ నాయక్ నుంచి 240 లీటర్ల సారాను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. అలాగే గ్రామ పరిసరాల్లో 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ప్రొహిబిషన్ ఎస్‌ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, సుదాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన పౌష్టికాహార వారోత్సవాలు

బనగానపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈసందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, లక్ష్మి తెలజ , జమీల పాల్గొన్నారు.

అవుకు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో ఉమామహేశ్వరమ్మ అన్నారు. మంగళవారం పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా ఎంపీడీవో కార్యాలయం సమావేశ భవనంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పావని, శివమ్మ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సును నిర్వహించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు, డాక్టర్లు అభి నయ్, నవీన్, హెల్త్ సూపర్‌వైజర్లు మల్లేశ్వరి, వరలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగాపురంలో కంటి వైద్యశిబిరం

బేతంచెర్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యనిపుణులు 134మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 39మందిని ఆపరేషన్ నిమిత్తం రెఫర్ చేసినట్లు కర్నూలు సుశీల నేత్రాలయ కంటి వైద్య నిపుణులు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. శిబిరంలో టీడీపీ నంద్యాల జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి లొద్ద శేఖర్, సీనారాయణ, మద్దులేటి, రామ మద్దుల, మద్దులయ్య, రాధాకృష్ణ, వెంకటరాముడు, రామ మద్దయ్య, శేఖర్, శివనారాయణ, నల్లారెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో సుబ్బారెడ్డి

డోన్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలో మంగళవారం వేంకటేశ్వరస్వామిని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనతో పాటు టీడీపీ యువ నాయకులు ధర్మవరం గౌతమ్ కుమార్ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు.

హెచ్ఎం గంగాధర్‌రెడ్డి సేవలు ఎనలేనివి

బనగానపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం గంగాధర్‌రెడ్డి సేవలు మరువలేనివని ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం పదవీ విరమణ చేసిన హెచ్ఎం గంగాధర్‌రెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. విద్యాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు కొనియాడారు. ఆయన భవిష్యత్‌లో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో విశ్రాంత జవాన్‌కు అంత్యక్రియలు

చాగలమర్రి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలచెరువు గ్రామానికి చెందిన విశ్రాంత బీఎస్ఎఫ్ జవాన్ నరసింహుడు(45) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. బీఎస్ఎఫ్ 42వ బెటాలియన్ కమాండెంట్ రవిరంజన్ ఆదేశంతో బీఎస్ఎఫ్ జవాన్లు గ్రామానికి చేరుకొని మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి గౌరవ వందనం చేశారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి మృతునికి నివాళులర్పించారు. అంతిమ యాత్రగా నరసింహుడు మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. కర్నూలు అసోసియేషన్ అధ్యక్షుడు బాలరంగయ్య మాట్లాడుతూ విశ్రాంత జవాన్ నరసింహుడు సెంట్రల్ ఆర్మ్‌డ్‌ఫోర్సెస్ ఎక్స్‌సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడని అన్నారు. నరసింహుడు సభ్యుడిగా ఉండటంతో బీఎస్ఎఫ్ హెడ్‌క్వార్టర్స్‌కు తెలియజేసి ఈ అంతిమ సంస్కార కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బీఎస్ఎఫ్ విశ్రాంత ఉద్యోగులు వెల్ఫేర్ అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకుంటే ఆ కుటుంబానికి కమిటీ అండగా ఉంటుందని అన్నారు. విశ్రాంత జవానుకు ప్రభుత్వ లాంఛనాల ప్రకారం అంత్యక్రియలు చేయడం ప్రథమం అన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ జవాన్లు చాంద్‌బాషా, నాగరాజు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లు, పోలీసులు ఇన్‌సెట్లో విశ్రాంత జవాన్ నరసింహుడు (ఫైల్)

ఫారెస్టు బీట్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి


మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఉమ్మడి జిల్లా జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు

బనగానపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఫారెస్టు బీట్ ఆఫీసర్ల సమస్యలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి జిల్లా జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం మంత్రి బీసీకి మంత్రి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ అటవీశాఖలో గత 20 ఏళ్ల నుంచి బీట్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న తమకు ఎలాంటి పదోన్నతులు లేవన్నారు. తెలంగాణలో మాదిరి ఏపీలో కూడా బీట్ ఆఫీసర్లనుంచి ఫారెస్టు సెక్షన్ అధికారిగా పదోన్నతి ఇవ్వాలని కోరారు. పోలీస్‌శాఖ మాదిరి అటవీ శాఖలో 15 రోజులు అదనపు యర్న్‌డ్ లీవ్‌లు మంజూరు చేయాలని కోరారు.

పేదల పాలిట వరం సీఎంఆర్ఎఫ్

నిరుపేదల పాలిట వరం సీఎం రిలీఫ్ ఫండ్ అని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న 21 మంది బాధితులకు రూ.34 లక్షల చెక్కులను మంగళవారం మంత్రి పంపిణీ చేశారు.

నిరంతర కృషి

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తన కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీలను స్వయంగా మంత్రి స్వీకరించారు. నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దని ఆదేశించారు.

రైతులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

రుద్రవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని ఆలమూరు గ్రామంలో గాలివాన బీభత్సానికి దెబ్బతిన్న బొప్పాయి తోటలను మంగళవారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రుద్రవరం రం మండలం ఆలమూరు, చాగలమర్రి మండలం చిన్న వంగలి, పెద్ద వంగలి, ఆళ్లగడ్డ మండలం వడకర్ల గ్రామాల్లో రైతులు బొప్పాయి, అరటి తోటలు గాలివాన బీభత్సంలో నష్టపోయారన్నారు. కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం కింద గతంలో ఎకరా అరటికి రూ.25వేలు, బొప్పాయికి రూ.15వేలు ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం అరటికి రూ.35వేలు, బొప్పాయికి రూ.25వేలు పెంచిందన్నారు. రైతుకు ఇది సరిపోకుంటే ఆ ర్థిక సహాయం అందించేవిధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. నష్టపోయిన రైతులకు త్వరగా ఆర్థికసాయం అందేలా కృషి చేస్తామన్నారు. రుద్రవరం రైతులకు గాలివానకు మామిడితోటలలో కాయలు రాలి తీవ్రంగా నష్టపోయినట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నారాయణ, సొసైటీ సంఘం అధ్యక్షుడు బ్రహ్మయ్య, పోలా గురుమూర్తి, ఎర్రం ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, తహసీల్దార్ మల్లికార్జునరావు, ఉద్యాన జిల్లా శాఖాధికారి నాగరాజు, ఏవో సుజాత పాల్గొన్నారు.


ఆలమూరులో బొప్పాయి తోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రుద్రవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈఘటన రుద్రవరం గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (50) అనే వ్యక్తి పేడలో కలిపి కల్లావుల్లో ద్రావణం తాగి సోమవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ వరప్రసాద్ మంగళవారం తెలిపారు. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించగా అక్కడ కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కొడుకు వెంకట మౌని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి

డోన్ టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం ధరిత్రి దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు వెంకట రమణ, సుబ్బారెడ్డి, వెంకటలక్ష్మి, బాబు, రాధ, లక్ష్మీకాంత రెడ్డి, మద్దిలేటి, ఆదినారాయణ, సుబ్బరాయుడు, రఘునాథ్, ఎస్తేరమ్మ, మధుసూదన్ రెడ్డి, సుభాన్ పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుం గ్రామ సమీపంలోని వెలసిన అభయాంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి ప్రతిమకు ప్రైన ఆకుపూజ, విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో డోన్ విద్యార్థుల ప్రతిభ

డోన్ టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో డోన్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పట్టణానికి చెందిన కామిశెట్టి చైతన్య కామిశెట్టి కల్పన దంపతుల కుమారుడు కామిశెట్టి శ్రీహర్ష హైదరాబాదులోని శ్రీ చైతన్య కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో శ్రీహర్ష 465/470 మార్కులు సాధించాడు. దీంతో తల్లిదండ్రులు అభినందించారు. అలాగే పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన న్యాయవాది హనుమంతరెడ్డి కుమారుడు అజిత్‌కుమార్ రెడ్డి ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 985/1000 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు పలువురు అభినందించారు.


కామిశెట్టి శ్రీహర్ష


అజిత్‌కుమార్ రెడ్డి

మట్టి నమూనాల సేకరణ

చాగలమర్రి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 17 రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతుల పొలాల్లో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరిస్తున్నట్లు ఏవో రంగసేతజ్ తెలి పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించి మట్టినమూనాల శాంపిల్స్ సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈవో మంజుల, సిబ్బంది ఉన్నారు.

అమ్మకాల నిలిపివేత

రుద్రవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పేడకు బదులుగా వాడే రసాయన ద్రావణం అమ్మకాలను నిలిపివేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ ద్రావణం తాగి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు ఈ ద్రావణం అమ్మకాలను నిలిపివేసినట్లు తెలిపారు. ఎక్కడయినా విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఆళ్లగడ్డ: పట్టణంలోని దుకాణదారులు సొబాగ్య రంగుల పొడిని విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి హెచ్చరించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కల్లాపి పొడిగను నిషేధించామన్నారు. దుకాణాల్లో అమ్మితే 133 సెక్షన్ కింద చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రేపు హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌ఆర్ అకాడమీలో గురువారం సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు నంద్యాల జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మహబూబ్‌బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ప్రకాశం జిల్లా ఒంగోలులో వచ్చేనెల 3, 4 తేదీల్లో జరిగే అంతర్రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడాకారులు ఉదయం 8 గంటలకు ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు.

పండ్ల తోటల సాగుకు వందశాతం రాయితీ

శిరివెళ్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం ద్వారా పండ్ల తోటల సాగుకు వంద శాతం రాయితీని ప్రభుత్వం అందిస్తోందని ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప తెలిపారు. మంగళవారం శిరివెళ్లలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను ఉపాధిహామీ పథకం ద్వారా హార్టికల్చర్‌లో భాగంగా మామిడి, నిమ్మ, కొబ్బరి, అల్లనేరేడు తదితర 18 రకాల పండ్ల తోటలు సాగు చేసుకునే లబ్దిదారులను ఎంపిక చేయాలని సూచించారు. కూరగాయల సాగుకు సంబంధించి రాయితీ గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎన్ఆర్ ఈజీఎస్ ఏపీవో రామసుబ్బయ్య, ఫ్లాంటేషన్ మేనేజర్ నాగరాజు, మండల హార్టికల్చర్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం'

శిరివెళ్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జమాల్ రాజా అన్నారు. మంగళవారం శిరివెళ్లలోని జేసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ప్రతి ముస్లిం సోదరుడు, సెక్యూలర్‌వాదులు వ్యతిరేకించాలన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆళ్లగడ్డ నియోజకవర్గ కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ముస్లింలు తరలిరావాలని ఆయన కోరారు.

పిల్లలు ఈతకు వెళ్లవద్దు

రుద్రవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సెలవుల్లో పిల్లలు ఈతకు వెళ్లవద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆటో యాత్రికుడు అబ్దుల్‌సాబ్ అన్నారు. మంగళవారం మండలంలోని నరసాపురం గ్రామంలో ఆటో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండి తమ పిల్లలను వేసవిలో రక్షించుకోవాలన్నారు. కొత్త ప్రదేశాల్లో ఈతకు వెళ్లడం అంత శ్రేయస్కరం కాదన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి పల్లకీ ఉత్సవం

చాగలమర్రి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తుల పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో ఉభయదారులు బాలేశ్వర్‌రెడ్డి దంపతులచే వెంకటేశ్వర స్వామి కల్యాణం, అభిషేకాలు, పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి


ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో అనూరాధ, ఉపాధ్యాయులు

చాగలమర్రి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటూ ఎంఈవో అనూరాధ, న్యాయమూర్తుల ఆధ్వర్యంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మంగళవారం అవగాహన ర్యాలీ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకత గురించి వివరించారు. ర్యాలీలో హెచ్ఎం శేషాద్రి, సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంచార వైద్యసేవలను వినియోగించుకోవాలి

చాగలమర్రి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో 104 సంచార వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యుడు ఇమ్రాన్ తెలిపారు. మంగళవారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో సంచార వైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ ఉన్నవారికి నెల రోజులకు సరిపడే మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్ఎం వేదమని, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

రీసర్వేపై రైతులకు అవగాహన

దొర్నిపాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రైతులకు రీసర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభద్ర అన్నారు. మంగళవారం మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో రైతులకు రీసర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల సమస్యలు ఏవైనా ఉంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో డీటీ మాధవ్, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

పరుగు పందెంలో విద్యార్థి ప్రతిభ

కోవెలకుంట్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో ఎల్‌కేజీ చదువుతున్న విద్యార్థి విశ్వక్ రామ్ కుమార్ రాష్ట్ర స్థాయి పోటీల్లో వంద మీటర్ల రన్నింగ్ పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించారని ప్రిన్సిపాల్ గీతా సిస్టర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థిని అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెన్నైలో ఈ నెల 20న రాజారతినం స్టేడియంలో లిటిల్ చాంపియన్‌షిప్ కిడ్స్ రన్ పోటీల్లో విశ్వక్ రామ్ కుమార్ (100 మీటర్ల) మెడల్ సాధించారన్నారు. కార్యక్రమంలో పీఈటీ వెంకటేశ్వర్లు హర్ష, ఓబులేసు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విశ్వక్ రామ్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గీతా సిస్టర్

ఓటరు జాబితాలో మార్పులకు అవకాశం

చాగలమర్రి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు తప్పులు ఉంటే సవరించుకోవాలని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 17 గ్రామ సచివాలయాల పరిధిలోని ఓటర్ల జాబితాను బీఎల్‌వోలకు అందించామన్నారు. జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. మరిన్ని వివరాలకు ఆయా గ్రామాల బీఎల్‌వోలను సంప్రదించాలని పేర్కొన్నారు. యువతీ యువకులు ఆన్‌లైన్‌లో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

పండ్లతోటల సాగుపై అవగాహన కల్పించాలి

అవుకు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు పండ్లతోటల సాగుపై అవగాహన కల్పించాలని హార్టికల్చర్ అధికారి రమేవరన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రైతుసేవా కేంద్రంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు అధ్యక్షతన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ అధికారి మాట్లాడుతూ 17రకాల పండ్ల తోటల పెంపకానికి వందశాతం సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ప్రకాష్‌రావు, వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

డోన్ టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ నాగార్జున అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో వాహనాలు తనిఖీ చేశారు.